


# మనసులు కలిసిన శుభవేళ...

బి.ఎస్. రాములు

"మమ్మీ! ఇవాళ సాయంత్రం ఏడు గంటల పదినిమిషాలకు నీకూ, డాడీకీ పోట్లాటవుతుంది. నువ్వు అరుస్తావు. డాడీ అరుస్తాడు. నువ్వు ఏడుస్తావు!" ఏడో తరగతి చదువుతున్న పవన, తల దువ్వుతున్న మమ్మీతో అంది సాయంత్రం జరగబోయే దృశ్యాన్ని ఊహిస్తూ.

లలిత పవన వెంట్రుకల్ని గట్టిగా లాగి, "నోరుముయ్యి!" అంది.

"మమ్మీ! సరిగ్గా ఏడున్నరకు డాడీ ఇదే డైలాగ్ నీతో అంటాడు నోరుముయ్యి అని!"

లలిత కూతురి తలపై మెత్తగా ఒక మొట్టికాయ వేసింది. "మమ్మీ!" అని అరిచింది పవన.

"ఏంటే మరి, పొద్దున్నే నీకు వేళాకోళంగా ఉందా? కాకి అరిచినట్టు శుభం పలకవే అంటే ఏదో అరుస్తున్నావు!" అంటూ ప్రేమగా కూతురు చెంపలు నొక్కింది లలిత.

"లేకపోతే ఏంటి మమ్మీ, నువ్వడగ్గానే ఔనౌను, తప్పక వెళ్లాలి అని అంటాడనుకున్నావా? డాడీ స్వభావం నీకు తెలుసా, నాకు తెల్సా?"

"డాడీ గురించి నీకేం తెల్సే? డాడీ చాలా మంచివాడు!" లలిత ఏదో అనబోయింది.

"డాడీ రేపు అందరినీ తీసుకెళ్తాడు. బెట్!" పవన తమ్ముడు నాలుగవ తరగతి చదివే ప్రవీణ్ ఛాలెంజ్‌గా అన్నాడు.

"తీసుకెళ్తాడు. కానీ దానికి ముందు ఇంకో సీను కూడా వస్తుందిరా! రాత్రి ఎనిమిదింటికి డాడీ మమ్మీని నాలుగు తిట్టి, వీలైతే చెయ్యెత్తి బయటకు నడుస్తాడు. రాత్రి తొమ్మిదిన్నరకు ఇంటికొస్తాడు. మమ్మీ మంచంలో పడి ఏడుస్తూ ఉంటుంది. డాడీ వచ్చే అలికిడి విని టీ.వి. ఆఫ్ చేసి నువ్వూ, నేనూ స్టడీ చేస్తున్నట్టు నటిస్తూంటాము. ఎవరమూ డాడీతో మాట్లాడం. 'వండి అక్కడ పడేయకపోతే తినమని పిలవచ్చు కదా!' అని డాడీ అరుస్తూ టెబుల్ మీదున్న గిన్నెల్లోంచి తానే వడ్డించుకుని తింటాడు.

రేపొద్దున చర్చ మళ్లీ మొదలవుతుంది. అప్పుడు నువ్వూ, నేనూ డాడీని బతిమాలుతాము. డాడీ బెట్టు సడలించి సరే అంటాడు. ఇక మమ్మీ అలగడం మొదలవుతుంది. 'నేను రాను, మీరే వెళ్లిరండి!' అంటుంది. డాడీ మళ్లీ అరిచి, బతిమాలాక మమ్మీ రెడీ అవుతుంది!" రాగం తీస్తూ పవన కథ చెప్తున్నట్టు చేతులు, కళ్లూ తిప్పుతూ అంది.

బాత్‌రూమ్‌లోంచి స్నానం చేసి బయటకు వస్తున్న డాడీని చూసి అందరూ నోరుమూసుకున్నారు.

రాత్రి సీను బదులుగా ఇప్పుడే అడిగితే బావుంటుందనుకుంది లలిత. అందుకు కారణం ఉంది.

క్రితంరోజు మోహన్ పిల్లలకు పళ్లూ, స్వీట్లు, తనకు మల్లెపూలు తెచ్చాడు. సెకండ్ షో సినిమాకి తీసుకెళ్లాడు. రాత్రి చెవిలో ఏవేవో గుసగుసలు చెప్పాడు.

"సినిమాకనగానే పెళ్లికూతిరిలా తయారవుతావు. ఇంట్లో ఇలాగే ఉండొచ్చుగా! నేను డ్యూటీ నుంచి వచ్చేసరికి ఇలా పెళ్లికూతురిలా టీతో ఎదురొస్తే జీవితం ఎంత ఆనందంగా ఉంటుంది?" అంటూ రాత్రి సినిమాకు వెళ్లేటప్పుడు కట్టుకున్న చీరను విడిచి మరో చీర కట్టుకుందామంటే కట్టుకోనీయలేదు. ఎన్నో చిలిపి చేష్టలు. ఎన్ని కబుర్లు చెప్పాడో!

"లలితా! సాధారణంగా భార్యాభర్తలు అన్యోన్యంగానే ఉంటారు. ఆయా విషయాలు, చర్చల్లో మొదలయ్యే అభిప్రాయ భేదాలే అన్యోన్యతను భంగపరుస్తాయి. నిజం చెప్పు, నీకూ, నాకూ మధ్య. ఏముంది? నాకు నీవూ, నీకు నేను తప్ప ఈ ప్రపంచంలో మనకు వేరెవరు తోడున్నారు?"

శ్వాసాడకుండా, మాట్లాడకుండా నాలుగు పెదాలు ఒకటైనాయి.

ఇన్ని విషయాలు చెప్తాడు మోహన్. కానీ ఎప్పుడు తలతిక్కలో పడి అందరి మూడ్ ఎలా పాడుచేస్తాడో ఎవరికీ అంతుపట్టదు అనుకుంది లలిత.

పిల్లలు టై కట్టుకుని, బూట్లు వేసుకుని స్కూలుకు రెడీ అయ్యారు. మమ్మీ బలవంతంమీద గబగబా ఇంత తింటున్నారు. మోహన్ కూడా టిఫిన్‌కు కూర్చున్నాడు. చక్కని సమయం అని లలిత విషయం కదిపింది.

పొద్దున్నే స్నానం చేసి ఆరేసిన వెంట్రుకల్లో పూలు తురిమిన లలిత ఎంతో అందంగా ఉంది. పవన మమ్మీకేసి సైగచేసి డాడీతో మారాంగా అంది


"డాడీ! మీనా అక్కయ్య కూతురు నామరకణోత్సవం రేపు. అక్కయ్య కూతురుకు ప్రెజంటేషన్ ఏం తీసుకెళ్దాం, డాడీ? మొన్న మా ఫ్రెండ్ వాళ్ల డాడీ వాళ్లన్నయ్య కూతురి కూతురికోసం గోల్డ్‌చైన్ చేయించుకొచ్చాడు."

"మనమూ గోల్డ్‌చైన్ తీసుకెళ్దాం, డాడీ!" అన్నాడు ప్రవీణ్.

ఆ మాటతో మోహన్ మూడ్ చెడిపోయింది. నవ్వుతున్నవాడల్లా ఏడుపు మొహంలోకి మారాడు. పవన గమనిస్తూనే ఉంది. ఆ మొహం ఏడుపు మొహంలోంచి కోపిష్టి మొహంగా మారింది. తమాయించుకున్నాడు మోహన్.

అన్నయ్యకు మనమరాలు పుట్టిందని మోహన్ పెద్దగా సంతోషించలేదు. నామరకణోత్సవానికి రమ్మని, అన్నా వదినలు స్వయంగా వచ్చి బొట్టుపెట్టి పత్రిక ఇచ్చి తప్పక రావాలన్నారు. అయినా మోహన్‌కు అట్టే ప్రేమ లేదు.

గత సంవత్సరమే అన్న కూతురికి పెళ్లయింది. మోహన్ తనవంతు బాధ్యతగా రెండు డెకోలం మంచాలు, స్పాంజి పరుపులు, ఓ చీరా పెట్టాడు. రెండు తులాల పుస్తెలతాడు చేయించమని వదిన అడిగింది. తాను కాదన్నాడు. కనీసం అల్లుడు అలగిపోయినకాడ పెట్టాల్సిన అరతులం బంగారు ఉంగరం చేయించమంది. దాన్నీ నిరాకరించాడు. రాజశ్రీకి పెళ్లిలో తాను పెట్టిందానికి సంతోషించకపోగా ఏమీ పెట్టలేదని బంధువులు చెవులు కూరుక్కోవడం అవమానం అనిపించింది మోహన్‌కు.



కుటుంబాలు వేరుపడినా అనుబంధాలు తెగడం అంత సులభం కాదు అని ఇరుక్షాలకూ తెల్సిపోయింది. అన్నదమ్ములు వేరుపడటానికి ఎంత యాతన, ఎవరికి ఎవరు చేసిపోయిందీ, ఉమ్మడి కుటుంబం వల్ల ఎవరెక్కువ లాభపడిందీ తవ్వి దుమ్మెత్తిపోసుకున్నారు.

"ఏంటి డాడీ, ఆలోచిస్తున్నారు? ఈవెనింగ్ మనం షాపింగ్‌కి వెళ్తున్నాం. రేపు ఉదయమే అక్కయ్య దగ్గరికి బలుదేరుతాం. కరెక్టేనా?" అంది పవన.

"మంచిది. ఏదో ఒకటి కొనుక్కెళ్దాంలే!" అన్నాడు మోహన్.

"అలా కాదు డాడీ, గోల్డ్‌చైన్ తీసుకెళ్దాం. పెద్దనాన్న ఆమేరకు రేపెప్పుడో నాక్కూడా పెడతారుగా!" అంది పవన.

'ఓహో ... ఈమెకు పెద్దనాన్న ప్రేమ కావాలి, అక్కయ్య ప్రేమ కావాలి. అందుకు తానిప్పుడు పెట్టుబడి పెట్టాలన్నమాట!' అనుకున్నాడు మోహన్.

"సరే, చూద్దాం!" అన్నాడు పైకి.

"మా డాడీ చాలా మంచి డాడీ!" అంటూ పవన డాడీకి పప్పీ ఇచ్చింది. నేనూ ఇస్తా అంటూ పక్కన నిలబడ్డాడు ప్రవీణ్. వాడిని ఎత్తుకున్నాడు మోహన్. అప్పుడు వాడికి డాడీ చెంప అందింది. పప్పీ ఇచ్చాడు.

పిల్లలు పరుగున స్కూలుకు బయలుదేరారు.

"భలే ప్లానేశారే ముగ్గురూ కలిసి!" నవ్వుతూ అన్నాడు మోహన్ లలితకేసి చూస్తూ.

"ఏం ప్లానండీ, నాకేం తెలియదు!" అంది లలిత.

"ఆс, అబద్ధాలు! నేను బాత్రూంలో ఉన్నప్పుడు ఏదో ప్లాన్ వేశారుగా?"

## 'డబ్బ్'ంగ్

"నా చేతిలో డబ్బులు నిలబడవండీ! డబ్బు ఉందంటే ఖర్చు అయిపోతుంది. డబ్బు విషయంలో నేను ఓపెన్ డామ్‌లాంటి వాణ్ణి. వేగం ఉంటుందే తప్ప, నిలకడ తక్కువ!" అన్నాడు నవీన్. నిజానికి 'లవ్‌స్టోరీ 1999' సినిమాని సొంతంగా తీసి చేతులు కాల్చుకోవడానికి ఇది కూడా ప్రధానకారణమేమో!

"డబ్బు ఎలాంటివారికైనా అవసరమే. అయితే నాకు పూర్తిగా డబ్బు వ్యామోహం లేదు. నా ఖర్చులకి తగినంత డబ్బు నా దగ్గర ఉంటే చాలు అనుకుంటాను. ఒకవిధంగా చెప్పాలంటే డబ్బనేది మనిషికి సెక్యూరిటీలాంటిదని చెప్పవచ్చు!" అంటున్నాడు ఈయన.

ఎల్

# ముతక పేరు!

సక్సెస్‌ఫుల్ చిత్రాల దర్శకుడు ముత్యాల సుబ్బయ్యకి తన పేరెంట్ చాలా ఇష్టమట. "నేను పెద్దవాడినయ్యాక మా అమ్మా, నాన్నలకు తిండి పెడతానో లేదో అని కూడా ఆలోచించకుండా వాళ్లు నాకు పేరు పెట్టారు. అది మా తాతయ్య పేరు. చాలామంది అంటూంటారు 'ఇదేం పేరు? ముతగ్గా ఉంది, మార్చుకో!' అని. కానీ ఆ పని నేను చేయలేను. ఎందుకంటే నేనేం కుర్రాణ్ణి కాదు, అమ్మాయిలు నన్ను, నా పేరును చూసి ఆకర్షణలో పడాలన్న వయసులో లేను. ఎందుకో నా పేరంటే నాకు బాగా ఇష్టం. 'సుబ్బయ్యా!' అని పిలుస్తుంటే ఎంత సంతోషంగా ఉంటుందో చెప్పలేను!" అన్నాడీయన తన పేరు వెనుక కథ గురించి చెబుతూ.

ఎల్



"ఛ! అలాంటివేం చెయ్యలేదండీ!" అంటూ కూతురు సాయంత్రం జరగబోయేసీనంటూ చెప్పిందంతా చెప్పింది లలిత. "అలాంటి సీన్లు తగ్గించుకోవాలనే ఇద్దరికీ ఉంది. కాదంటారా?"

లలిత మాటలతో మోహన్ గతం గురించిన ఆలోచనలో పడ్డాడు. వదిన ఎంత తిట్టిందో గుర్తొచ్చి అదోలా అయ్యాడు.

"కన్న కొడుకులా చూసుకున్న నన్ను ఇన్ని మాటలనడానికి నీకు నోరెట్లా వచ్చింది మరిదీ?" అంటూ ఏడ్చింది వదిన. కోపంతో ఏడు దోసిళ్లతో మట్టి ఎత్తిపోసింది.

"నన్ను కొడుకుతీరు చూసుకున్నావా? పనిమనిషికన్నా హీనంగా చూశావు! సలిబువ్వ, సలికూరలు పెట్టి నువ్వూ, అన్నయ్యా వేడివేడివి తిన్నారు!" అన్నాడు మోహన్.

"నేను తినంగ, మిగులుతదనుకున్నప్పుడే నీకు సలిబువ్వ పెట్టాను. ఇంటికి సంబంధించిన పని చేస్తేనే నీకు పనిమనిషి తీరనిపిస్తే ఏండ్ల తరబడి ఇదే పని చేస్తున్నాను. నేనేం అనుకోవాలె. నీతోని నా చీరలు ఉతికిస్తే అనాలి. గిన్నెలు కడిగిస్తే అనాలి!"

"నీ తమ్ముడినైతే ఇలాగే చూసేదానివా?"

"నా తమ్ముడినైతే ఈడ్చి ఇరవై కొట్టేదాన్ని. మరిదిని ఏమన్నా కష్టమే అని ఎంతో మర్యాదగా చేశాను. నువ్వు పని చేయకపోయినా వెళ్లదీసుకున్నాను!"

"ఇప్పుడు నేను సంపాదిస్తున్నానని మీకు మంట! జీతమంతా మీ చేతిలో పోయాలని దురాశ!" అంటూ ఎగిరాడు మోహన్.

మోహన్ అన్నయ్య మదనయ్య తిట్టి తిట్టీ అలిసిపోయాడు. తమ్ముణ్ణి ఎంత కష్టపడి చదివించిందీ ఏకరువు పెట్టాడు. వదిన వత్తాసు పలికింది.

"ఇన్నేండ్లనుండి చేసిన మా 'చేత'(చేతి కష్టం) అంతా గంగలో పోయిందా! నీ చిన్నప్పుడే వేరుపడితే నీ చదువు సంగతి తెలిసేది. అరవ కష్టాలు పడి మేం నిన్ను చదివిస్తే మంచి ఉద్యోగం వచ్చాక మాకు పెట్టాల్సివస్తుందని వేరు పడుతానంటున్నావు. పడు! దేవుడు మాకు రెక్కలిచ్చాడు. మా రెక్కల యూరాండ్లు ఎవరూ లేరనుకుంటాను!" ఏడుస్తూ శపించింది వదిన.

"అక్కా, తిట్టకే! నీ భయంతో, బావ భయంతో మా ఆయన మంచిగా ఉంటాడని కల్సే ఉందామని ఉంది. ఇట్లయిపోయింది!" అంటూ లలిత ఏడుస్తూ వదినని బతిమిలాడింది.

"ఏ పేపర్ తెప్పించాలి, ఏ సిన్మా చూడాలి, టీ.వీ.లో ఏ ఛానెల్ పెట్టాలి, ఏ సబ్బు వాడాలి, ఎవరింటికి భోజనాలకు వెళ్లాలి, ఎవరింటికి పోవద్దు ... అని అన్నీ మీరే నిర్ణయించేదైతే ఎందుకు కలిసి ఉండటం వేరుంటే నా ఇష్టం వచ్చిన కూరలు వండించుకుంటాను. ఇష్టం వచ్చిన సిన్మాకు కల్సి వెళ్తాం. నడుమ మీ పెత్తనం ఏంటి?" మోహన్ అరగంట ఆవేశపూరితంగా ఉపన్యాసం దంచాడు.

ఎలాగైతేనేం వేరుపడిపోయారు. చెంబులు, ముంతలతో సహా చెరిసగం పంచుకున్నారు. ఉద్యోగం చేసే ఊళ్లో అవి పెట్టుకోవడానికి స్థలం చాలక ఇంట్లోనే ఓ గదిలో వేసి తాళం వేసుకున్నాడు. తల్లీ దండ్రీ పోయి చాలాకాలమైంది.

అలా వేరు పడిననుంచి వారింటిమీద కాకి వీళ్లింటిమీద వాలలేదు. పలకరింపులు ఆగిపోయాయి. పిల్లలు పెరుగుతున్న కొద్దీ అన్నదమ్ముల పిల్లల మధ్య కొత్త అనుబంధాలు మొదలయ్యాయి.

"దసరా సెలవుల్లో పెద్దమ్మ ఇంటికెళ్దాం, డాడీ!" అంటుంది పవన. పైగా డాడీనే అక్కడ దింపి రమ్మంటుంది.

"ఈ సంక్రాంతి సెలవుల్లో అన్నయ్యను, అక్కయ్యను ఇక్కడే ఉండాలన్నాను, డాడీ!"

వాళ్లు వీళ్లూ కలిసి సెలవుల్లో ఇల్లంతా పీకి పందిరేసినంత అల్లరి. అక్కడ అన్నయ్య ఇంట్లో అదే అల్లరి.

తాము దూరమైనా పిల్లల మధ్య ద్వేషాలు రగల్చడం ఎందుకులే అని ఊరకుండిపోయాడు మోహన్. పైగా ఎదిగిన తమ్ముడు అన్నకు ఏమీ సాయం చేయక దూరంగా ఉంటున్నాడని అప్పటికే అప్రదిష్ట మోస్తున్నాడు.

అన్నా వదినలు మాట కలుపుకునే ప్రయత్నం చేస్తే, అఁ, ఏముందీ, మాట కలుపుకుంటే ఏదో ఒకటి చెందదా అనే స్వార్థం తప్ప, ప్రేమా? అని విసుక్కున్నాడు మోహన్. కానీ పిల్ల రాకపోకల్ని తుంచడం కుదరలేదు. అంతగా బంధువులు మాత్రం ఎవరున్నారని ఊరకుండిపోయాడు మోహన్.

ఏదో ఆలోచిస్తున్న మోహన్‌కు టీ ఇస్తూ, నవ్వుతూ అంది లలిత "విరిగిన హృదయాలు అతుక్కోవు అనేది మీ అన్నదమ్ముల విషయంలో కాలం చెల్లిన మాట!"

"అఁ... పంపు కొట్టు! మరి భార్యాభర్తల విరిగిన హృదయాలూ?" అంటూ నవ్వాడు మోహన్.

"అవి ఎముకలకన్నా తొందరగా ఇరవైరోజుల్లోపే అతుక్కుంటాయి!" అంది లలిత.

"అబ్బో.... అలాగా!" అంటూ ముద్దుపెట్టుకోబోయాడు మోహన్.

"మరీ చిన్నపిల్లాడిలా చేస్తున్నారేంటండీ?" నవ్వింది లలిత.

"ఔను, లలితా! మనం చిన్నపిల్లల్లానే ఉందాం. చిన్నపిల్లలు ఇంట్లాగే కొట్లాడుకుంటారు, ఇట్టే కలిసి ఆడుకుంటారు. రెండ్రోజులు కలుసుకోకపోతే బెంగపడిపోతారు. పెద్దలు కూడా చిన్నపిల్లల్లా మారగలిగితే ఏ వయసులోనైనా విరిగిన హృదయాలు అతుక్కుంటాయి!" అంటూ మోహన్ లలిత చుట్టూ చేతులు వేశాడు.

"ఇంతకీ మన మనుమరాలుకు గోల్డ్‌చైన్ తెస్తున్నారా, పవన చెప్పిన సీన్లు సృష్టిస్తారా?" మోహన్ నవ్వాడు. లలితకు ఆ నవ్వు అర్థం తెలుసు. అకస్మాత్తుగా పప్పీ ఇచ్చి వంటరూమ్‌లోకి తుర్రుమంది లలిత. ■